# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# పీడకల

"వీడి బాధ చూడడం నావల్ల కావడం లేదు లక్ష్మీ! ఆ పిల్ల అడిగినదేదో పారేస్తే ఈ పీడ వదిలిపోతుంది కదా అనిపిస్తోంది." అన్నాడు సుందర్రావు భార్యతో..

" నిజమేనండీ, మీరన్నట్టు పీడలాగే దాపురించింది మన ప్రాణానికి. పీడకల అని మరిచిపోయే వీలు కూడా లేదు. ఎన్ని రోజులవుతోంది? ఏమిటో మరి ? ఆ పిల్ల తీరే అర్ధం కావడం లేదు నాకు!" అంది బాధగా.

"ఇందులో అర్ధం కాకపోవడానికేముంది? తన కోర్కెలు తీర్చుకోవడానికో అమాయకుడు కావలసి వచ్చాడు వాళ్ళకి. మన దురదృష్టవశాత్తూ మనం దొరికాం, అంతే! పువ్వుల్లా సుకుమారంగా ఉండే ఆడపిల్లలు ఇంత భయంకరంగా ఆలోచించగలరనీ, ఇంత నీచంగా ప్రవర్తించగలరనీ మనం ఊహించలేదు. అదే మన తప్పు! "

"అయినా ఆడపిల్లకామాత్రం పట్టూ విడుపూ ఉండద్దూ?"

" ఇక్కడ మగా, ఆడా అన్నది కాదు లక్ష్మీ, ముఖ్యమైన విషయం ఏమిటంటే మనిషన్నాకా కాస్త విచక్షణ ఉండాలి.. అది లేని నాడు మనిషికీ, జంతువుకీ తేడా లేదు నా దృష్టిలో. ఆపిల్ల మాట్లాడే మాటలకి అర్ధం లేదు, ఆ కోరికలకి అంతం లేదు.

నాకు మొదటినించీ ఇష్టం లేదు, కానీ ఎదిగిన పిల్లలని వాళ్ళ ఇష్టాలనీ కాదనలేం గా? అందుకే సరే అనక తప్పలేదు. అదే ఇప్పుడు ఇలా మన కొంప ముంచుతోంది" అనాడు చిరాగ్గా.

" ఏమైనా సరే,ఆ పిల్ల అడిగిన వాటికి ఒప్పుకోవడం మాత్రం నాకిష్టం లేదు" అని స్థిరంగా అంటున్న భార్యవైపు చిత్రంగా చూశాడు సుందర్రావు.

" అవునండీ, ఇదేం బొమ్మలాటా? ఓ సారి అవుననీ, ఓ సారి కాదనీ అనడానికి.. ఇష్టం వచ్చినట్లు అడగడానికి. మీరు, వాడు కష్టపడి సంపాదించిన సొమ్ము. ఊరికే ఆ పిల్ల ముఖాన ఎందుకు పొయ్యాలి? అసలది ఆడుతున్న నాటకాలన్నీ దీనికోసమే కదూ!" అంది కోపంగా.

" అది మనందరికీ తెలుసు, కానీ చట్టాన్ని, కోర్టునీ ఎలా నమ్మించగలం? ఇద్దరూ పరస్పర అంగీకారంతో వెళితే తప్ప ఇవి అంత త్వరగా తేలే సమస్యలు కావుగా. తను అన్నవన్నీ చేస్తే తప్ప పరస్పర అంగీకారానికి ఒప్పుకోను అంటోందాయె. అది కూడా తేల్చి చెప్పదు.. కలిసిన ప్రతీసారీ ఓ కొత్త రకం." అన్నాడు ఆయన బాధగా.

" దీనికేమీ మార్గం లేదా? అసలేం చూసుకుని వాళ్ళ ధైర్యం?" అంది లక్ష్మి కోపంగా.

" ఏం చూసుకునా? ఆడపిల్లల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టాలని ఎలా తమకనుకూలంగా మార్చుకోవాలో, తద్వారా అమాయకులతో ఎలా ఆడుకోవాలో తెలియడం వల్లవచ్చిన ధైర్యాన్ని చూసుకుని. అయినా వాడి సుఖం కంటే మనకేదీ ఎక్కువ కాదుగా! కావాలంటే ఆస్థి మళ్ళీ సంపాదించుకోవచ్చు. ఎంతో ఇష్టపడ్డాడు ఆ పిల్లని, ఇలా అవుతుందనుకున్నామా?" అన్నాడాయన.

"సన్నజాజిపువ్వులా ఉంది మొదటిసారి మనకి పరిచయం చేసినప్పుడు. మాట కాస్త పెళుసుగా అనిపించినా అమ్మాయి బావుంది, చదువుకుంది. పైగా వాడి కంపెనీలోనే పనిచేస్తోంది. మనవాళ్ళు కాకపోతేనేం? ఈ రోజుల్లో ఎందరు చేసుకోవడం లేదు? అనుకున్నాను. మీరు వాడికి నచ్చచెప్పబోతే కూడా నేనే వాడికి సపోర్ట్ చేశాను కూడా. వాడిష్టం కాదనడమెందుకు? అని. ఇప్పుడు మాత్రం ఆ పిల్ల అన్నదానికి ఒప్పుకోలేకపోతున్నాను.. మనమన్నదేదీ వాళ్ళకు వద్దు అంటే ఎలా? పైగా జైలూ, కోర్టూ అంటూ బెదిరిస్తారా? ఏం తమాషా అనుకుంటున్నారా?" ఆవేశంగా అంటోంది లక్ష్మి.

" హుష్! మెల్లగా మాట్లాడు. వాడు వింటే బాధపడతాడు" అన్నాడు సుందర్రావు.

వినబడీ వినబడనట్టుగా సాగుతున్న తల్లి తండ్రుల సంభాషణ మీద మనసే లేనట్టుగా పక్క గదిలో మంచం మీద పడుకుని ఉన్నాడు సిద్ధార్ధ్.

అతని కళ్ళ ముందు చెదురుమదురుగా వస్తూ పోతున్న దృశ్యాలు.

పచ్చని తంగేడు పూల మధ్యన తెల్లటి సల్వార్ కమీజ్ వేసుకుని అచ్చు ప్రేమదేశం సినిమాలో హీరోయిన్ టబు లా కనిపించింది మొదటిసారి మీనా తనకి.

'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' కాకపోయినా చూడగానే ఎంత బావుందీ ! అనుకోకుండా ఉండలేక పోయాడు.

తను కాంపస్ ఇంటర్వ్యూలు చెయ్యడానికి వాళ్ళ కాలేజీకి వెళ్ళినప్పుడు జరిగిందీ సంఘటన. పక్కన ఎవరో అబ్బాయితో ఏదో వాదనలో ఉన్నట్టుగా ఉంది ఆమె ముఖం చూస్తే. ఆమె మాటలకి తగ్గట్టుగా ఒక్కోసారి నెమ్మదిగా, మరోసారి కాస్త విసురుగా, ఆవేశంగా ఊగుతున్న చెవి జూకాలు, ఎండలో ఎర్రబడి మెరుస్తున్న ముఖమూ.. ఒక్కసారి చూస్తే చాలు, చాలా సార్లు గుర్తొచ్చే రూపం ఆమెది.

ఆ తర్వాత ఆ అమ్మాయిని ఉద్యోగానికి తన కొలీగ్ శివ సెలెక్ట్ చెయ్యడమూ, తమ కంపెనీలోనే చేరడమూ జరిగింది.

కొత్తగా చేరిన వారికి కంపెనీ గురించిన విషయాలు, వివరాలు చెప్పడానికి వెళ్ళినప్పుడు రెండో సారి చూశాడు. లేత నీలం రంగు జీన్స్, పైన తెల్లటి షర్ట్ వేసుకుంది.. అలల్లా ఎగురుతున్న జుట్టు, వాటిమధ్యలో చేపపిల్లల్లా కదులుతున్న నల్లటి కళ్ళూ.. అందుకే మీనాక్షి అని పేరు పెట్టారేమో! అనుకున్నాడు.. చురుకుగా అన్నింటిలోనూ పాల్గొంది.

ఐదడుగుల ఆరంగుళాల ఎత్తు, నల్లటి అందమైన జుట్టూ, చూడగానే కట్టిపడేసే కళ్ళూ.. ఒక్కసారి చూసినవారెవరైనా మర్చిపోవడం కొంచం కష్టమే. ఆ అందమైన రూపానికి తగ్గట్టు అందమైన మనసుండాలని అనుకోవడమే అమాయకత్వం. అది ఆలస్యంగా అర్ధమైంది అతనికి.

మూడు నెలల ట్రెయినింగ్ తర్వాత తన టీములోకే ఆ అమ్మాయి రావడం సిద్ధూకి చాలా ఆనందంగా అనిపించింది.

మీనా చాలా తెలివైనది. కేవలం పని త్వరగా నేర్చుకోవడం లోనే కాదు, ఏ పని చేస్తే గుర్తింపు త్వరగా వస్తుందో అలాంటివి ఎంపిక చేసుకుని అందరికంటే ముందుగా చెయ్యడం, అవసరమనుకుంటే ఎదుటివారి పనికి కూడా మెప్పు తనే అందుకునేలా చేసుకోవడమూ, చూసుకోవడం ఇలాంటివాటిల్లో కూడా.

అది స్వార్ధమనుకోవాలో, నేటి భాషలో street smartness అనుకోవాలో తెలీలేదు సిద్ధూకి. మొదట్లో ఈ మాత్రం పోటీ తత్వం మామూలే, ఒక స్థాయి కి వచ్చాకా కొంత పరిణతి వస్తే అందరూ మారతారు అనుకున్నాడు సిద్ధార్ధ్.

కానీ అదే మీనాక్షి స్వభావమని అతనికి తెలీలేదు. తనకి కావలసినది సాధించుకోవడానికి ఏం చెయ్యడానికైనా ఆమె సిద్ధం అని, తనకి నచ్చినదేది తను తప్పనుకోదని.. ఇవన్నీ ఏమీ తెలీదు అతనికి అప్పుడు. మంకు పట్టు కూడా చాలా ఎక్కువ ఆ అమ్మాయికి.

ఒక టీం లీడర్ గా ఇవన్నీ గమనించాడు అయినా పెద్ద విషయాలుగా భావించలేకపోయాడు.. కారణమేమిటో అప్పుడు తెలీకపోయినా, ఇప్పుడు తెలుసు. తనకి తెలీకుండానే ఆమెతో పీకలోతు ప్రేమలో పడడమే.

మీనా కూడా సిద్ధూ అంటే ప్రత్యేక శ్రద్ధ ఉన్నట్టుగానే ప్రవర్తించేది. ఏ పనికావలసి వచ్చిన మధ్యలో ఉన్నవారిని ఖాతరు చెయ్యకుండా అతన్నే నేరుగా అడిగేది. అలా మెల్లగా మొదలయిన పరిచయం, ప్రేమగా మారడానికి ఎక్కువ కాలం పట్టలేదు.

సిద్ధార్ధ లక్ష్మీ సుందర్రావులకి ఒక్కడే కొడుకు. కూతురు సిరి పెళ్ళి అయ్యి ఢిల్లీలో ఉంటుంది.. సుందర్రావు బాంక్ లో పనిచేసి ఈ మధ్యనే రిటైర్ అయ్యాడు. సిటీ సెంటర్ కి కాస్త దగ్గరలోనే కట్టుకున్న స్వంత ఇల్లూ, దానివెనక ఇద్దరూ కలిసి చేసుకునే తోట పని, సంగీతమూ.. కొడుకుతో గడిపే సమయం..ఇలా హాయిగా కాలం గడుపుతారు వాళ్ళిద్దరూ..

కొడుక్కి కూడా పెళ్ళి చేసి కోడలిని ఇంటికి తెచ్చుకుంటే చాలన్న భావన లో ఉన్నారు వాళ్ళిద్దరూ అదే ప్రస్తావన తెచ్చినప్పుడు సిద్ధూ మొదటిసారి మీనా గురించి చెప్పాడు.

సిద్ధార్ధ సంగతి తెలిసిన సుందర్రావు అది ఊహించలేదు అందుకే కొద్దిగా ముందూ వెనకలాడాడు. లక్ష్మి మాత్రం ' వాడికి నచ్చడం కన్నా ముఖ్యమా? ఈ రోజుల్లో ఇవన్నీ మామూలే!" అంటూ కొడుకు నిర్ణయాన్ని సమర్ధించింది..

చిత్రంగా మీనాక్షి మాత్రం సిద్ధార్ధ ప్రపోజ్ చెయ్యగానే ఒప్పుకోలేదు సరి కదా,

" యా, ఐ.యాం ఓకే ఇన్ ప్రిన్సిపుల్. బట్ నాకు కొన్ని కండీషన్స్ ఉన్నాయి " అంది సీరియస్ గా..

" కండీషన్సా?" అన్నాడు సిద్ధూ..

" యా, నేనొక్కదాన్నే అమ్మానాన్నలకి..వాళ్ళు నా దగ్గరే ఉంటారు.. మీ ఇంట్లో వాళ్ళకేమీ లోటు జరక్కూడదు.. నేను కూడా నా ఇష్టం వచ్చినట్టు ఉంటాను, నాకెవరూ అడ్డు చెప్పకూడదు. మన సంపాదనలు ఎలా ఖర్చు పెట్టుకోవాలి అనేది నా ఇష్టమే, నీవి, నావి ఆస్థులు వేరేగా ఉండాలి" లాంటి రక రకాల విషయాలు చెప్పింది.

వాటిల్లో తామిద్దరూ కలిసి గడపబోయే జీవితం గురించి కానీ, చెయ్యవలసిన పనులను గురించి కానీ ఒక్కటీ కూడాలేకపోవడం సిద్ధూ దృష్టిని దాటిపోలేదు కానీ అప్పుడతను పట్టించుకోలేదు.

" నువ్వంటే నాకేమీ పెద్ద స్పెషల్ఇంటరెస్ట్ లేదు. వెనకబడ్డావని ఒప్పుకున్నా ను. అది మనమెప్పుడూ మర్చిపోకూడదు, " పెళ్ళి అయిన రెండో రోజున చెప్పిన మీనా మాటలకి ఆశ్చర్యపోయాడు సిద్ధార్థ్. పైగా ప్రతీ దానికి నాకు ఏదైనా డైరెక్ట్ గా మాట్లాడడమే అలవాటు అంటుంది...

" మా అమ్మా నాన్నా సౌత్ ఇండియా తిరగడానికి వెళ్ళా రు, వచ్చాకా ఇక్కడ వాళ్ళుంటున్న ఇల్లు ఖాళీ చేసి మరో నెల, రెండు నెలలలో ఇక్కడికొచ్చేస్తారు . ముందే చెప్పానుగా వాళ్ళు మనతోనే ఉంటారని. ఆ పైన కార్నర్ రూం కావాలంది మా అమ్మ. ఈలోపున ఖాళీ చేస్తే పెయింటింగ్ అవీ వేయించి రెడీ చెయ్యచ్చు" అంది మీనాక్షి స్థిరంగా ఆ తర్వాత నాలుగైదు రోజులకే..

" వాళ్ళు ఇక్కడే ఉంటానంటే ఎవరికీ ఏ అభ్యంతరం లేదు. నువ్వా మాట చెప్పగానే అమ్మ కూడా ఇంట్లో సందడిగా ఉంటుంది అనే అంది. కానీ ఆ రూము మా అమ్మా, నాన్నల బెడ్ రూం మీనా. ఇంకా నాలుగు బెడ్ రూములున్నాయి ఇంట్లో మన రూముతో సహా. వాటిల్లో ఏదైనా ఇద్దాం మీవాళ్ళకి" అతనంటూ ఉండగానే..

" నాకవన్నీ తెలీదు. అమ్మకి ఆస్థ్మా ఉంది. బాగా వెలుగు, ఎండా వచ్చే రూమే ఉండాలి, డాక్టర్ మరీ మరీ చెప్పాడు. లేదంటే ఇట్స్ ఓకే. మనం వేరే ఇల్లు తీసుకోవచ్చు" అంది కటువుగా..

అలా మాట్లాడుతున్న ఆ పిల్లని చిత్రం గా చూసింది లక్ష్మి ..

సుందర్రావు " పోనీలేరా, రూముదేముంది, నేను ఇప్పుడే మార్పిస్తాలేమ్మా" అన్నాడు కోడలితో.

" థాంక్స్! " అని పొడిగా చెప్పి వెళ్ళిపోయింది ఆమె. పరవాలేదని ఒక్క మాట కూడా అనలేదు.

ఆ అమ్మాయి మనసులో ఏముందో తెలీదు కానీ ప్రతీ దానికీ గొడవపెట్టుకోవడానికే ప్రయత్నించేది.

" ఆ అమ్మాయి దేనికో అప్సెట్ అయిందేమో, బహుశా తల్లి తండ్రులని విడిచి వచ్చిందిగా మొదటిసారి.. పోనీ మీరిద్దరూ నాలుగు రోజులు ఎటైనా తిరిగి రండి" అండి లక్ష్మి సిధ్ధూతో..

దానికీ ఇష్టపడలేదు మీనా.. " నాకు చాలా పని ఉంది. ఇప్పుడు కుదరదు" అంది.. తనకి తెలీని ఆఫీసు పని ఆమెకేముందో అర్థం కాలేదు సిధ్ధూకి. హనీమూన్ కి తీసుకువెళతానంటే వద్దనే ఆడపిల్లలుంటారా? అనుకున్నాడు. తనతో అంటీ ముట్టనట్టుగానే ఉండే ఆమె ప్రవర్తన అతనికర్థం అయ్యేది కాదు.

కొన్నాళ్ళు చిన్నతనంగానూ, మరికొన్నాళ్ళు అదామె స్వభావంగానూ సరిపెట్టుకుంటూ ఆరునెలలు గడిపారు సిద్ధార్ధ, అతని తల్లి తండ్రులు.

ప్రతీ రెండు రోజులకీ తనదేదో కోరిక చెప్పడం, దానికని గొడవపెట్టడం ఏదైనా అంటే "నువ్వే ప్రపోజ్ చేశావు, నేనేమీ నీ వెనక పడలేదు" అంటూ సాగదీసి గొడవ చెయ్యడం ఇలాంటివి మాములుగా జరగసాగాయి.. దానికి కారణమేమిటో అంతుబట్టని సిద్ధార్ధకి అసలు విషయం చాలా ఆలస్యంగా తెలిసింది.

ఆమె పరిచయం అయిన కొత్తలో చిలిపితనంగానూ, చిన్నతనపు చేష్టలుగానూ అనిపించినవి రాను రాను మూర్ఖత్వంగా మారాయి.

" అసలా అమ్మాయి మనసులో ఏముందో కనుక్కోరా ఒకసారి?" అంది లక్ష్మి . అడగక్కరలేకుండా నే తెలిసింది కారణం సిద్ధార్ధకి.

మనువైన చోట లేని ఆమె మనసు అని.. ఆమె మనసులో ఉన్నది ముకుంద్, అతని స్థాయి తమకి సరిపడక ససేమీరా అన్నారు మీనాక్షి తల్లి తండ్రులు. కాలేజీరోజులనించీ పరిచయం, సినిమా హీరోలాంటి రూపం తప్ప మరేమీ లేని ముకుంద్ అంటే మీనాక్షికి ఆరో ప్రాణం.

ఇండియాలో ఉద్యోగం దొరకడం, దొరికినా పది, పదిహేనువేలకి పనిచెయ్యడం తన వల్ల కాదనగల పొగరు మాత్రం ఉంది ఆ కుర్రాడికి. కళ్ళు, కలలు ఆకాశంలో, కావలసిన అర్హతలు పాతాళంలో.. ఇంజనీరింగ్ పూర్తి చెయ్యడమే గగనంగా, ఎలాగో అయిందనిపించాడు చదువు.

'ఇమ్మిగ్రేషన్ లో ఆస్ట్రేలియా వెళ్ళిపోదాం, అక్కడ నా స్నేహితులు చాలా మంది ఉన్నారు కనక ఉద్యోగం సులువుగా దొరుకుతుంది, అక్కడకెళ్ళిపోయి హాయిగా ఉందాం' అని చెప్పిన మాటలుమీనాకి నచ్చాయి కానీ వెళ్ళడానికి కావలసిన డబ్బు ఎక్కడనించి తేవాలో తెలీలేదు..

దానికా పిల్ల ఎంచుకున్న మార్గం సిద్ధార్థ.

ఈ విషయం అర్థం అవగానే మ్రాన్పడిపోయాడు. సిద్ధార్థ.

తమ రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఎన్నో చట్టాలను ఆడపిల్లలు తమ ఇష్టాలకీ, సరదాలకి వాడుకుంటున్నారని అతనికీ తెలుసు కానీ చూడడానికి అమాయకంగా, ఇంకా మాట్లాడితే చిన్న పిల్లలా కనిపించే మీనాక్షి కూడా ఇలా ప్రవర్తించగలదని అతను ఊహించలేకపోయాడు.

" నీకు నాతో పెళ్ళి ఇష్టం లేనప్పుడు నేను అడిగిన పుడెందుకు ఒప్పుకున్నావు?" బాధగా అడిగాడు..

మాట్లాడలేదు మీనాక్షి. " ఇదీ ఒక ప్రశ్నేనా?" అన్నట్టు చూసింది అతనివైపు.

"ఇద్దరం కలిసి ఉండలేనప్పుడు విడిపోవడం మంచిది. విడాకులకి ప్రయత్నం చేద్దాం. ఇద్దరికీ ఇష్టమైతే సులువుగా వస్తాయి" అన్నాడు.లక్ష్మి , సుందర్రావు బాధ పడ్డారు.

"చిన్నపిల్ల, ఏదో తొందరపడిందే అనుకో, నువ్వు కూడా ఏవిట్రా?" అంది లక్ష్మి కొడుకుతో.

మాట్లాడలేదు మీనా. దానికి ఆమె తండ్రే సమాధానం చెప్పాడు.

" పెళ్ళీ, విడాకులూ అన్నీ నీ ఇష్టమేనా? అది నిన్నొదిలేసి వాడితో వెళ్ళిపోతే మా సంగతేమిటి? మాక్కొన్ని కండీషన్లున్నాయి" అన్నాడు.

అప్పటికే వాళ్ళ సంగతులన్నీ బాగా తెలిసిన సిద్ధార్థ, అతని తల్లి తండ్రులు ఏమీ మాట్లాడలేదు. అవేమిటని అడగలేదు, అతనే చెప్పాడు..

అతను చెప్పినవి వింటూఉంటే మతి పోయింది లక్ష్మీ, సుందర్రావులకి..

మొదటగా తామిద్దరి ఖర్చులకీ సిద్ధార్థ నెలకి ఇరవై వేలు చొప్పున బేంకులో ఒకటోతారీఖు కల్లా వెయ్యాలని, పెళ్ళికి మీనాక్షికి ఇచ్చిన నగలూ, పట్టు చీరలూ ఇవేమీ తిరిగి ఇమ్మనకూడదనీ ఇలాంటివెన్నో చెప్పాడు.

అన్నింటికన్నా చివరిది, ముఖ్యమైనది అంటూ కోటిన్నర ఖరీదు చేసే ఈ ఇల్లు మీనాక్షి పేరు మీద రాయాలనీ, అప్పుడే సంతకం పెట్టాలా, లేదా అన్నది ఆలోచిస్తామని ఖచ్చితంగా చెప్పాడు.

" దాని దారి అది చూసుకుంటే మా సంగతేమిటి? రేపది ఆస్ట్రేలియావో, అంటార్కిటాకో వెళ్ళిపోతే మమ్మల్నెవడు చూస్తాడు? నెత్తిమీద గూడు లేకుండా ఎలా?" అన్నాడు

అతని మాటలు విన్న లక్ష్మికి పట్టరాని కోపం వచ్చింది. "ఇప్పటికేదో మీకు స్వంత ఇల్లున్నట్టు? అంత గూడుండాలని ఆలోచన ఉన్నవాళ్ళు ఓ ఇల్లు కొనుక్కోలేకపోయారా జీవితమంతా దుబారా ఖర్చులు పెట్టకపోతే. అయినా మా ఇల్లివ్వమని ఎలా అడుగు తారు?" అంటూ గట్టిగా ఎదురు మాట్లాడింది..

" నో ప్రాబ్లెం, మా నాన్న అడిగినవి మీకిష్టం లేకపోతే ఓకే, నేను చూసుకోవలసిన రూట్ చూసుకుంటాను.. లీగల్ గానే వెళ్ళచ్చు, నాకేమీ అభ్యంతరం లేదు" అంది మీనాక్షి పెళుసుగా. అప్పుడే అర్థం అయింది, తండ్రీ కూతుళ్ళిద్దరూ కలిసే ఇదంతా చేస్తున్నారని..

అప్పటినించీ సాగుతూనే ఉంది ఈ జంఝాటం గత ఏడాదిగా. మొదట ఆరునెలలూ తమింట్లోనే ఉన్న వాళ్ళు ఇక్కడ తమకి భద్రత లేదని పోలీసులకి చెప్తామని బెదిరించి వేరే అద్దె ఇల్లు తీసుకున్నారు, దానికి అద్దె సిద్ధార్థే కట్టేలా చేసింది మీనాక్షి. తన జీతం మాత్రం తన జల్సాలకీ, సరదాలకీ ఖర్చు పెట్టుకుంటుంది..

ముకుంద్ ఆస్ట్రేలియా వెళ్ళే ప్రయత్నాలు మొదలు పెట్టాడు.

తనకి తెలిసిన సీనియర్ లాయర్లిద్దరు ముగ్గురిని కలిశాడు సిద్ధార్థ్. ఇలాంటి విషయాల్లో ఆడపిల్లలకుండే ప్రత్యేక అధికారాలని వాళ్ళు బాగా తెలుసుకునే ఇలా ప్రవర్తిస్తున్నారనీ, వీలున్నంత త్వరలో సామరస్యం గా సెటిల్ చేసేసుకుంటేనే మంచిదనీ చెప్పారు. ఆమె అంగీకారం లేకుండా

విడాకుల ప్రసక్తే ఉండదని, వాళ్ళు ఇంకాస్త ముందుకెళ్ళి అక్కరలేని కేసులు అవీ పెడితే మొదటికే ప్రమాదమవుతుందని IPC498a సెక్షన్ గురించి చెప్తూ హెచ్చరించారు.

ప్రతీ నెలకో, పది హేను రోజులకో మీనాక్షి డబ్బు కావాలనడం, లేదా మాట్లాడి సెటిల్ చేసేసుకుందాం అనడం..ఆపైన ఏదో ఒక మెలిక పెట్టడం రివాజయిపోయింది.

తామూ మధ్యతరగతి వాళ్ళమని, ఎంతో కష్టపడి ఇల్లు, ఆస్థి సమకూర్చుకున్నామని ఎన్నో రకాల చెప్పాడు సుందర్రావు. చివరికి యాభై లక్షలదాకా ఇవ్వగలనని కూడా చెప్పాడు సిద్ధార్థ వద్దని వారిస్తున్నా సరే!

అయినా దిగి రాలేదు మీనాక్షి తండ్రి. తమ కూతురు వాళ్ళ కొడుకు భార్య, ఇంటి కోడలు కనక చెరో సగమైనా ఇవ్వమని, ధైబ్బై లక్షలిస్తే చూద్దామని ఖరాఖండీగా చెప్పేశాడు.

ఇంటి కోడలుగానూ ఏనాడూ ప్రవర్తించని పిల్లకి ఇలా అడిగే అధికారముందా? అనుకోవడం తప్ప మరేమీ చెయ్యలేకపోయారు.

గతమంతా మనసుని కలచివేస్తూ ఉంటే లేచి హాల్లోకొచ్చాడు సిద్ధార్థ్. అతన్ని చూసి సుందర్రావ్ అన్నాడు.

" ఇంక మనం పట్టుదలకు పోవద్దురా, లెట్స్ గెట్ ఓవర్ విత్ ఇట్ నాన్నా, ఎంత కావాలన్నాడు? సంతకం పెట్టాకా ఇస్తామంటే ఒప్పుకోడా? సరే మూడు సార్లుగా ఇస్తామని చెప్దాం, సంతకం పెట్టాకా ఒకసారి, మధ్యలో మరోసారి, విడాకులు మంజూర్ అయ్యాకా మూడోసారి ఇస్తామని చెప్దాం. ఒప్పుకోకపోతే అప్పుడే చూద్దాం! " అన్నాడు..

"కానీ అంత డబ్బు ఎక్కడనించి తెస్తాం? ఫ్లాట్ బుక్ చేద్దామని దాస్తున్న నా సేవింగ్స్ తో ఒకసారి కట్టచ్చు, ఆ తర్వాత?" అన్నాడు సిద్ధార్థ్.

"ఇల్లమ్మేద్దాం! ఓ ఫ్లాట్ కొనుక్కుందాం, మనముగ్గురికీ ఫ్లాట్ చాలుగా!" అన్నాడు సుందర్రావు.

"వద్దు నాన్నా! ఇది మన డ్రీం హౌస్. ఆ పీడకలకోసం అమ్మడమా? నో వే! చూడాలి. మరో మార్గం చూడాలి. ఐ కాంట్ టేక్ దిస్ ఎనీ మోర్.. నాకోసం కాదు, నా వల్ల మీరందరూ ఇబ్బంది పడుతుంటే నేను తట్టుకోలేకపోతున్నాను. ఐ హేట్ దిస్ బ్లడీ లా. ఎంత ఏకపక్షంగా ఉంది. అదే కదూ? వీటన్నింటికీ కారణం! " అన్నాడు బాధగా..

"ఇల్లు అమ్మడం నీకిష్టం లేకపోతే ఇంటిమీద అప్పు తెద్దాం లే, ఏదో ఒకటి చేద్దాం. నువ్వే అన్నావుగా, పీడకల అని ! మధ్య రాత్రి వచ్చిన పీడకలలా వచ్చిన ఆ పిల్లని వదుల్చుకోవడమే మనకి ముఖ్యం.. బికాజ్ ఐ నీడ్ మై సన్ బాక్.." అన్నాడు సుందర్రావు ఆవేదనగా.

"పచ్చనైన ప్రతి కథకూ తల్లి వేరు పడతులూ, భగ్గుమనే కాపురాన అగ్గిరవ్వ భామలు." టీవీలో పాట వస్తోంది.

COMMENTS